[illegible] కథ

# విచారపుటంచులు

— మంథా వెంకట రమణారావు

మాది కాలనీ జీవితం. ఫ్యాక్టరీకి ఆదివారం వెళ్ల నక్కరలేదు. అందువల్ల ఆరోజు ఒక స్నేహితుడి ఇంట్లో పేకాడుకుంటున్నాం.

అప్పుడు హనుమంతరావు ఆదరాబాదరాగా వచ్చి, రాగానే ఏడవడం ప్రారంభించేడు. హనుమంతరావు మీద మాకెప్పుడూ సానుభూతి లేదు. అతడు గర్విష్టి. మాతో ఎప్పుడూ కలవడు. ఏమయింది అని అడిగేం. చెప్పేడు – ఫ్యాక్టరీలో కొత్తగా చేరిన అతడి దూరపు బంధువయిన చంద్రం అనే యువకుడికి నిన్న ఆకస్మాత్తుగా జ్వరం వచ్చిందని, హాస్పిటల్‌లో చేర్చగా, కోమాలోకి వెళ్లేడని, తనకేం చెయ్యాలో పాలుపోవడంలేదని. ఆ యువకుడికి కొత్తగా పెళ్లయిందిట. క్వార్టరు దొరక్కపోవడంవల్ల భార్యను తీసుకురాలేదుట. ఆమె అత్తమామలతో విజయవాడలో వుంటోందిట. వాళ్లకి టెలిగ్రాం ఇంకా ఇవ్వలేదుట.

మేం హాస్పిటల్‌కి వెళ్లేసరికి రోగి ఆఖరు ఘడియల్లో వున్నాడు.

అప్పుడు అనుకోకుండా వచ్చేరు రోగి తండ్రీ, తమ్ముడూనూ. నెలదినాలయి, కొడుకు ఉత్తరాలు రాయకపోవడంవల్ల, పండగలు దగ్గరపడడంవల్ల విశాఖపట్నమే కదా, చూసివద్దాం. వీలయితే కొడుకుని పండగలకి కూడా తీసుకవెళ్దాం అనుకుని వచ్చారు.

కొడుకుని ఆ స్థితిలో చూసిన తండ్రికి కలిగిన షాక్‌ని వర్ణించలేను. ఏముంది వర్ణించడానికి? విచారాన్ని వర్ణిస్తే పైవారు తెలుసుకోగలరా? అది అనుభవించేవారికి తెలుస్తుంది.

అక్కడే కూలిపోయాడా ముసలి తండ్రి. అతడ్ని కూడా హాస్పిటల్‌లో చేర్చాలేమో ననుకున్నాం. కాని తేరుకున్నాడు. తండ్రి రిటైరయ్యాడు. అతడి సంసారానికీ (పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు, కాలేజీలో చదువుతున్న చిన్నకొడుకు వున్నారు) కొత్తగా వచ్చిన కోడలికీ అందరికీ ఈ మంచంమీది మనిషే దిక్కు. కోడలు ఉత్తమనిషి కూడా కాదు. ఈ జీవి బతికి బట్టకడితేనే తమ జీవితాలు సాఫీగా నడుస్తూ వుంటాయన్న ఆశ.

మరో గంటకి ఆ యువకుడు ఈ లోకం వదిలిపోయాడు. అతడికి తండ్రి, తమ్ముడు వచ్చారనే తెలియదు. అప్పటికే చీకటి పడిపోవడంవల్ల, మర్నాటికి అంత్యక్రియలు వాయిదాపడ్డాయి. తండ్రి ఏడ్చే ఏడుపులు తక్కిన పేషెంట్లని కలవరపెట్టకుండా, శవాన్ని మంచంతో సహా హాస్పిటల్ లోకి మారుమూలలకు తీసుకపోయారు. ఒకరి ఏడుపు మరొకరికి ఆందోళన కలిగించకూడదు. ఏడవడం కూడా నాగరికంగానే ఏడవాలి. ఆ రాత్రల్లా శవం ప్రక్కనే గడిపారు తండ్రి, తమ్ముడూనూ. చుక్క మంచినీళ్లయినా ముట్టలేదు.

మర్నాటికి వారి మనసుల్లో కుర్రాడు పోయాడనే విచారం తగ్గి, తమ భావి ఏమౌతుందన్న విచారం పట్టుకుంది. తిరిగి వెళ్లేక కోడలు ఎదురుగా వస్తే ఆమె పసుపుకుంకుమలు గంగలో కలిసాయన్న సంగతి ఎలా చెప్పడం? తమ కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా అవుతాయి? చిన్నకొడుకు చదువు ఎలా సాగుతుంది? తమకి దినం ఎలా గడుస్తుంది?

అంత్యక్రియలు జరిగిపోయాయి.

నేను ఆ ముసలి తండ్రి విచారాన్ని గమనిస్తున్నాను. తీవ్రమయిన శోకం మనిషిని ఎలా కదిల్చివేస్తుందో చూస్తున్నాను. కాని అంత విచారంలోనూ మనిషి కొన్ని కొన్ని బలహీనతలని కూడా ప్రదర్శిస్తాడు. శవానికి అగ్నిసంస్కారం చేసేముందు బట్టలు తీసేశారు. వ్రేలికున్న బంగారం ఉంగరం ఒకంతటకి రాలేదు. అరతులం బరువుంటుంది. "మనిషే పోయినప్పుడు బంగారం ఎందుకు. వాడితోపాటు దానినీ కాలి[illegible]" అని మాత్రం తండ్రి అనలేదు. వ్రేలిని కోసేస్తే తప్ప ఉంగరం ఊడిరాదేమోననిపించింది. మా తంటాలు తండ్రి చూస్తూనే వున్నాడు. ఉంగరానికీ, వ్రేలికీ మధ్య చాకు పెట్టి ఎలా అయితేనేం ఉంగరాన్ని తీశాం. తండ్రికిస్తే మారుమాట లేకుండా జేబులో వేసుకున్నాడు.

తండ్రి వైఖరి నాకెందుకో సరిగా లేదనిపించింది. ఇంత లోతైన విచారంలో బంగారంకోసం ఆ లోభత్వం ఎందుకు? అమలినమైన విచారానికి మచ్చ ఏర్పడినట్టయింది.

ఎత్తిపోతలూ వెంటనే అయిపోయాయి. అస్తికలని ఒక చిన్న డబ్బాలోకి ఏరుకున్నాడు తండ్రి ఏడుస్తూనే.

ఇతడు తిరిగి వెళ్లేక ఆ ఊళ్ళో జరగబోయే దృశ్యం నా మనసులో మెదిలింది. తండ్రి రైలు దిగి రిక్షాలో ఇంటికి వెలతాడు. రిక్షా వచ్చిన సడి వినిపించగానే కోడలు ముఖానికి పసుపుకుంకుమలతో, మెడలో మంగళసూత్రాలతో, చేతులకి గాజులతో, కాళ్లకి మట్టెలతో కళకళలాడుతూ గుమ్మంలోకి వస్తుంది, భర్త పండక్కి వచ్చేడనుకొని. కాని ముసలాడూ, మరిదీ మాత్రమే రిక్షా దిగుతారు. మామగారి ముఖంలోని విచారం గమనించేసరికే ఆమెకు పరిస్థితి సగం అర్థం అయిపోతుంది.

ఇంట అడుగుపెడుతూనే బావురుమంటాడు ముసలాడు. "చంద్రం మరి మనమధ్య లేడమ్మా" అంటూ చేతిలోని అస్తికల డబ్బాని చూపించి తల బాదుకుంటాడు. ఆ చిన్న ఆస్తికల డబ్బాని ఆమెకిస్తాడు.

అప్పటివరకూ నిలిచి వున్న ఆమె ప్రపంచం కుప్పగా కూలిపోతుంది. ఆమె మనసు రోదిస్తుంది ఆమెతో పాటే. "ఈ ఎముకలతోనే నీ జీవితాన్ని ముడి వేసుకున్నావు. ఈ ఆస్తికలు మనిషయి బతికున్నప్పుడు ఎంతో ఆనందాన్నీ,



విచారాన్నీ, కాముకత్వాన్నీ అనుభవించేవు. ఎన్నో గాలిమేడలు కట్టుకున్నావు. ఎన్నో కలల లోకాలు కట్టుకున్నావు. చివరికి మిగిలిందేమిటి నీకు?"

అసలు ఆమె ప్రపంచం భర్త ఇక్కడ నిన్న ప్రాణాలు వదలగానే కూలిపోయింది. కాని అతను పోయాడన్న నిజం తెలియనంతవరకూ ఆమె ప్రపంచం నిలబడే వుంటుంది. మాటవరసకి ఆమె మామగారు "నీ భర్త మరో ఆడదానితో లేచిపోయాడు. నిన్ను వదిలి పెట్టేడు. నీకు నెల నెలా ఇంత పంపుతాడు" అని చెప్పి ఆమె జీవనోపాధికి ఏదో మార్గం కల్పించి, ఆమె ప్రపంచాన్ని నిలబెట్టవచ్చు. జీవితం అంటే మనసు, బుద్ధి, జీవంతో కల్పి సృష్టించే ప్రపంచమే కదా? ఆమె భర్తమీద కోపాన్నీ, ద్వేషాన్నీ పెంచుకోవచ్చు. తరవాతెప్పుడో అసలు సంగతి బయటపడినా, ఆమె ప్రపంచం పూర్తిగా ధ్వంసం కాదు.

కాని ఆ ముసలి మామగారు తనలోనే అంత విచారాన్నీ ఇముడ్చుకోగలిగే ప్రకటిస్తుడుకాదు. వీలయినంత వేగంగా మనసులోని విచారాన్ని ఆమె మీద వదిలేసి తన భారాన్ని తగ్గించుకుంటాడు.

అలా ఊహించుకున్నాను.

ఆ సాయంత్రం నేను అయ్యరు హోటలుకి వెళ్లేను కాఫీ తాగుదామని. టిఫిన్ తినాలనిపించలేదు. ఆ యువకుడి చావు, తలిదండ్రుల విచారం, మృతుడి భార్య మున్ముందెదుర్కొనే కష్టాలూ నా మనసులో కదలాడుతున్నాయి. వారంతా రెండు మూడురోజులవరకైనా నిద్రాహారాలు మాని [illegible]

హోటల్లో ఒక మూలకి కూచొని కాఫీకి ఆర్డరిచ్చేను.

అక్కడ చూసేను వాళ్లని. చనిపోయిన చంద్రం ముసలి తండ్రీ, తమ్ముడూ, హనుమంతరావూ ఒక టేబిల్ దగ్గర సావకాశంగా కూర్చొని టిఫిన్ తింటున్నారు. వాళ్లొక మూలకు కూర్చున్నారు కాబట్టి నన్ను గమనించలేదు. ముందుగా స్వీట్లు తిన్నారు. తరువాత పెరుగ్గారెలు తిన్నారు. మసాలా దోసెలు తిన్నారు. స్ట్రాంగ్ కాఫీ తాగేరు. ఆవురావురుమంటూ తిన్నారు. అడవి జంతువులు మృతకళేబరంమీదపడి తిన్నట్టుగా తిన్నారు. వాళ్లు తింటున్నప్పుడు వారి దృష్టి తిండిమీదే. ఏడేడు జన్మాల్లోనూ తిండెరగనట్టు నోటితో చప్పుడు చేసుకుంటూ తిన్నారు.

వారు చేసిన పనిలో విడ్డూరం ఏమైనా వుందా? నిజానికి ఏమీ లేదు. మనిషి ఆకలికి బానిస. ఆకలిదప్పులు విచారాన్ని అధిగమిస్తాయి. కడుపునిండాకే అనుభూతులన్నీ మనసులో చోటు చేసుకుంటాయి.

అయినాసరే, నాకు ఆ తండ్రినీ, తమ్ముడినీ, హనుమంతరావునీ ఆ స్థితిలో చూడగా "నో! దిస్ ఈజ్ నాట్ రైట్!" అనిపించింది. ఇలా జరగకూడదు అని నా మనస్సు ఆక్రోశించింది.

ఇవాళ ఉదయం శవం కాలేటప్పుడు తండ్రి కంటికీ, మింటికీ ఏకధారగా ఏడ్చేడే? చచ్చిపోతానన్నాడు. భావి శూన్యం తనకింక అన్నాడు! తల నేలకి కొట్టుకున్నాడు. మట్టిలో దొర్లేడు. ఇంకా రేపు ఇంటికి వెళ్లేక అతడి భార్య నల్లపూసలని తెంపవలసిన తంతుంది. ఆమె గాజుల్ని పగలకొట్టుకుంటే చూసే హృదయవిదారకమైన పనుంది. కాని ఇదేమిటి? ఒక్క పూటైనా తిండి మానలేక, కడుపునిండా స్వీట్లు, హాట్లు పట్టిగ్గా హోటలుకి వచ్చి మరీ కొట్టేస్తున్నారు?

కాఫీ తాగలేక లేచివెళ్లి పార్కులో కూర్చున్నాను. అకస్మాత్తుగా నాకు జ్ఞానోదయమయింది!

ఆకలి ఆకలే. విచారం విచారమే. ఈ ఆకలే లేకపోతే, అతడికి కొడుకు పోయేడన్న విచారమే వుండదు. ఎందుకంటే ఆకలే లేకపోతే ఒక మనిషి మరొక మనిషిమీద ఆధారపడి వుండడు. సంసారం వుండదు. భార్య భర్తమీదకాని, తండ్రి కొడుకుమీదకాని, ప్రజలు ప్రభుత్వం మీదకాని ఆధారపడి వుండనక్కరలేదు. ఆకలి తీర్చుకోవాలి కాబట్టి, అది తీరే ఆధారంకోసం వెతుక్కోవడం. బ్రెడ్ విన్నర్‌కోసం ఆరాటం.

మృతుడి భార్య కూడా కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తుంది. వారం రోజులు తినదు. తరువాత క్రమేపీ తేరుకుంటుంది. ఎంగిలిపడుతుంది. కాలక్రమేణా తన కాళ్లమీద తను నిలబడుతుంది. ఉద్యోగం చేస్తుంది. పోయిన భర్త స్మృతులు మూలపడతాయి. మనసయితే, మగదిక్కుకోసం వెతుక్కొని, దొరికాక హాయిగా అతడితో వుంటుంది! ఆనందం లానే విచారమూ శాశ్వతం కాదన్న నిజం గ్రహిస్తుంది.

ఎవరికెవరు?